# తెలియని నిశ్చయం



◆ శ్రీ విరించి ◆

సాయంత్రం నాలుగు గంటలయింది. 'టీ' సమయం. సరస్వతి అరగంట క్రితమే నిద్రలేచి అంతా సిద్ధం చేస్తూ వుండింది. దయానిధి ఇక పడక గదిలోంచి ఇవతలికి రాలేదు.

కాలేజి నుంచి రెండు గంటలకంతా ఇంటికి వచ్చేస్తాడు దయానిధి. మరి మధ్యాహ్నం మళ్ళీ వెళ్ళే పని లేదు. రావడంతోటే భోజనం చేయడం, నిద్రకు ఉపక్రమించడం–ఇంతే పనులు.

సర్వీస్. నుంచి రిటైరయిన తరువాత 'ప్రొఫెసర్ ఎమెరిటస్'గా ఈ దూర ప్రాంతాలలో నివాసం ఏర్పరుచుకోవలసి వచ్చింది. మరో సందర్భం అయితే, ఉద్యోగం కోసం ఇంత దూరం రావడం ఈ వయసులో చేసే పని కాదుగాని–ఈ పరిస్థితి వేరు.

పుస్తకాలు చదవడం, రాయడంతోటే యాభై యెనిమిదేళ్ళ దాకా కాలం గడిపిన దయానిధి రిటైర్ అయిన తర్వాత ఊరికే కూర్చోవటానికి మనస్కరించలేదు. ఇంక చదువుకోవలసినవి, ముందు తరాల వాళ్ళకోసం గుది కూర్చవలసినవి అనేక విషయాలు వున్నాయి. చెయ్యి–కాలు ఇంకా సరిగానే వున్నాయి. మనస్సు చెప్పినట్టు వింటూ చెయ్యవలసిన పనులన్నీ చేస్తోంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో యేదో యూనివర్సిటీలో 'డాక్టరేట్' కోసం చదువుతున్నాడు. అమ్మాయి లెవరూ లేరు. కొడుకు అమెరికా నుంచి వచ్చిన తరువాత ఇక్కడే యేదో నికార్సయిన ఉద్యోగం చూచుకుంటాడు. అప్పుడు వాడికి తగిన అమ్మాయిని చూచి వివాహం చేసేస్తే తమ కుటుంబ బాధ్యతలు తీరుతాయి.

ప్రొఫెసర్ షిప్‌కు సంబంధించిన నియమాల ప్రకారం ఈ దూర దేశంలో మూడు సంవత్సరాలపాటు తప్పనిసరిగా వుండవలసి వస్తోంది. అయితేనేం?–దయానిధికి ఎటువంటి విచారమూ లేదు.

"అంతదూరం వెళ్ళడం నీకు ఇష్టమేనా? మరీ వంటరిగా ఇబ్బంది పడిపోతావేమో–" అని దయానిధి తనను అడిగినప్పుడు సరస్వతి చాలా హుందాగా సమాధానం చెప్పింది. "నాకేమీ ప్రత్యేకించి ఇబ్బంది లేదు. మీరు దగ్గరగా వుండగా నాకు వంటరితనం అనే బాధేముంది? సమయాన్ని మీ యిష్టం వచ్చినట్లుగా వినియోగించు కోండి–" అంది.

భర్త పనులకూ, ఆలోచనలకూ యే పరిస్థితిలో అయినా ఆసరా యివ్వడంతప్ప ఇంకేం ఎరగదు సరస్వతి.

'మరీ అంత యిబ్బంది అనుకుంటే అప్పుడు ఆలోచించుకుందాం' అనుకుని ఇద్దరూ ఈ దూర ప్రాంతానికి వచ్చేశారు.

వచ్చి ఆరు నెలలయినా, ఇక్కడ ఎవరితోనూ అంతగా పరిచయాలు కాలేదు. 'కాంపస్'లో వున్న అయిదారు కుటుంబాలు 'ఎవరి పద్ధతి వారిది' అన్నట్లుగా ఎవరి పనులలో వాళ్ళు కూరుకుపోయి వుంటారు. ఎక్కువగా 'సోషలైజ్' చేసుకుందుకు, పరిచయాలు పెంచుకుందుకు అంత అవసరమూ లేదు, అవకాశమూ అంతంత మాత్రమే.

దయానిధిని నిద్రనుంచి లేపుదామా అనుకుంది సరస్వతి. ఏది, ఒక్క అరగంట ఆలస్యం అయితేయేం మునిగిపోయిందట; పడుకున్న మనిషిని నిద్రలేపడం ఎందుకు? టీ చల్లారిపోతుందని యేమీ బాధలేదుగా, అని సమాధానం చెప్పకుంది.

డ్రాయింగ్ రూంలో కూర్చోబోతూ వుండగా ఎవరో 'డోర్ బెల్' నొక్కారు. గుండెల్లోంచి దూసుకు పోతున్నట్టు ఛాలా భయంకరమైన శబ్దం. దీన్ని మార్చి చక్కటి 'మ్యూజికల్ సౌండ్స్' పలికే బెల్ పెట్టించుకోవాలని అనుకుంటూనే సరస్వతి తలుపు వైపు నడిచింది.

ఎవరో యిరవై యేళ్ళ అమ్మాయి.

గులాబీ రంగు చూడిదార్ వేసుకుంది. దుపట్టా మీద కూడా అల్లికలు కొట్టవచ్చినట్టుగా వున్నాయి.

చూడ చక్కనైన ముఖం.

పెదవుల నిండా చిరునవ్వు అలుముకుపోయి, బుగ్గల మీదకు ప్రాకుతోంది.

"నమస్తే. ఆంటీ. డిస్టర్బ్ చేస్తున్నాను, క్షమించండి"–అంది ఆ అమ్మాయి సరస్వతిని చూడడంతోటే.

ఎవరు ఈ అమ్మాయి?

ఎవరు కావాలని వచ్చింది?–అని తటపటాయించడంతో సరిపోయింది సరస్వతికి–రెండు మూడు నిమిషాలు. ఆ అమ్మాయి మరింత చొరవగా "దయానిధి అంకుల్ ఉండేది ఈ ఇల్లే కదూ ఆంటీ! పక్క ఇంటి వాళ్ళు ఇదేనని చెప్పారు. అందుకనే ధైర్యంగా డోర్ బెల్ నొక్కాను. అంకుల్ ఇంట్లో వున్నారా ఆంటీ?" అనడిగింది. వెంటనే నేను "లోపలకు రావచ్చునా ఆంటీ!" అని కూడా అంది. అప్పుడుగానీ సరస్వతికి తన అనౌచిత్యం స్ఫురించలేదు.

"తప్పకుండా రా అమ్మా లోపలకు" అని గుమ్మంలో నుండి అడ్డం తొలగింది.

"మీరు మిసెస్ దయానిధి గారే గదండీ! నేనెం తప్పగా మాట్లాడడం లేదుగా. మిమ్మల్ని నేనెప్పుడూ చూడలేదు. ఆ మాటకు వస్తే అంకుల్‌ని గూడ ఎప్పుడూ చూడలేదు. కాకపోతే మా ఇంట్లో




చదువులు, శ్రద్ధ ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా మా నాన్నగారు అంకుల్ పేరు చెప్పి అరగంటసేపు ఉపన్యాసం ఇస్తారు–క్షమించండి, యేమిటే మిటో మాట్లాడేస్తున్నాను–నన్ను గురించి యేమీ చెప్పకోకుండానే. నా పేరు శైలజ. రాజమండ్రిలో అడ్వకేట్ కమలాకరరావుగారు మా నాన్న. దయానిధి అంకుల్, మా నాన్న కాశీలో కలిసి చదువుకున్నారుట చిన్నప్పుడు. ఎం.ఎ. లో మా నాన్నగారికున్న అతి తక్కువ మిత్రుల్లో అంకుల్ ఒకరు. అయితే ఎప్పుడూ మీరు మా ఇంటికీ, మేం మీ ఇంటికీ రావడం తటస్థ పడలేదు ఇంత వరకూ. ఇప్పడయినా ఓ విచిత్రమైన పరిస్థితి నన్ను ఇక్కడకు లాక్కు వచ్చింది ఆంటీ–" అంది ఆ అమ్మాయి.

సోఫాలో అటు యిటు అలవోకగా కదులుతూ చేతులు, ముఖము మాటలకు అనుగుణంగా మార్చుకుంటూ తిప్పకుంటూ అతి పరిచయం వుండి రోజూ ఒక గంటసేపయినా తప్పనిసరిగా కలుసుకుని కబుర్లు చెప్పకునే స్నేహితులలాగా ప్రవర్తిస్తున్న ఈ అమ్మాయి–శైలజ– సరస్వతికి ఎంతో ముచ్చటగా అనిపించింది.

"ఇంతదూరం ఎలా వచ్చావమ్మా?" అని అడుగుతూనే ఆ అమ్మాయి ముఖంలో లీలమాత్రంగా కనిపిస్తున్న అలసటను, దానిని మింగివేయటానికి ప్రయత్నిస్తున్న ఉత్సాహాన్ని చూసింది సరస్వతి.

"నీవు రావడం చాలా బాగుందమ్మా–కాస్త నిదానంగా కూర్చో. ఓ కప్ప టీ తీసుకు వస్తాను. తాగుతూ కబుర్లు చెబుదువుగాని–" అని సరస్వతి లోపలకు వెళ్ళింది.

మరు నిముషంలోనే టీ కప్ప, నాలుగయిదు బిస్కట్‌లు ఉన్న ప్లేట్ ఓ ట్రేలో పెట్టుకు వచ్చి శైలజ ముందు వుంచింది.

"మీరు తీసుకోరా ఆంటీ! ఒకే కప్ప తెచ్చారేం?" అని అడిగింది శైలజ.

"మీ అంకుల్ ఇంకా మధ్యాహ్నం నిద్రనుంచి లేవలేదమ్మా. ఆయన లేచి యివతలకు రాగానే ఇద్దరం తీసుకుంటాం. ఫరవాలేదు నువ్వు తీసుకో" అంది సరస్వతి.

శైలజకు 'టీ' నచ్చినట్లుంది. తాపీగా తృప్తిగా తాగుతున్నట్లు కనిపించింది సరస్వతికి.

"చక్కెర సరిపోయిందామ్మా?" అనడిగింది ఆమె.

"సరిగ్గా సరిపోయిందండీ. ఈ టీ మీరు యిచ్చారు గనక కానీండి, నిజానికి మా అమ్మగారు తయారుచేసినట్లే వుందండి. నాకు అచ్చంగా మా యింట్లోనే ముందు గదిలో కూర్చుని టీ

## జూహీచావ్లా పెళ్ళి వాయిదా..



'రామ్‌జానే' కాస్తా ఫ్లాప్ కావటంతో జూహీచావ్లా తన స్థానాన్ని ఎలాగయినా నిలబెట్టుకోవాలని కంకణం కట్టుకుంది. మంచి బ్యానర్‌లలో చాన్సుల కోసం చూస్తోంది.

ఓ సంవత్సరం వరకు కలసిరాదు అని జ్యోతిష్కుడు చెప్పటంతో జైమెహతాతో తన వివాహాన్ని కూడా వాయిదా వేసుకుంది 'జూహీ'

— సత్యశ్రీ

తాగుతున్నట్లుగా అనిపిస్తోందండీ మీరేమైనా అనుకోండి–నా మనసులో మాట దాచుకోవడం నాకు చేతకాదండీ–" అంది శైలజ.

సరస్వతికి ఆ అమ్మాయిని చూస్తుంటే యేదో ఆత్మీయత యేర్పడడం ప్రారంభం అయి, ఈ సరికి ఆ అమ్మాయే మనసునిండా చోటుచేసుకుంది. మనసు విప్పి మాట్లాడడం అంటేనే హృదయానికి చేరువగా రావడం గదా!

"ఏదో విచిత్రమైన పరిస్థితి అన్నావు గదమ్మా యిందాక. ఏమిటది? ఏమయినా నీవు ఇలా వెదుక్కుంటూ రావడం నన్ను నోరారా పలుకరించడం, అరమరికలు లేకుండా మాట్లాడించడం... నాకు ఎంత సంతోషంగా వుందనుకున్నావు. మీ అమ్మగారు నీకు మంచి కలివిడితనం నేర్పారు. ఆమెను అభినందించాలి ముందు. మీ అమ్మగారి పేరేమిటమ్మా" అనడిగింది సరస్వతి.

"అవునండీ. మీకు మా అమ్మగారి పేరే తెలియదు గదూ. మా అమ్మ పేరు మందాకిని. మీరన్నట్లు నాకు ఇంత కలివిడితనం నేర్పింది మా అమ్మే. నాన్నగారు కూడా అఫ్‌కోర్స్–యేమీ అనరనుకోండి. ఏ సమయంలో ఎలా స్ఫూర్తిగా పనిచేయాలి–అనే విషయం మా అమ్మ దగ్గరే నేర్చుకుంటున్నానండీ నేను–"

"ఎవరితో సరస్వతీ మాట్లాడుతున్నావూ?" అంటూ దయానిధి అప్పుడే గదిలోంచి ఇవతలకు వచ్చాడు. ఆయన్ను చూడడంతోటే శైలజ వినయంగా లేచి నిలుచుని 'నమస్తే, అంకుల్' అంది.

"లేచారా. రండి. మీ స్నేహితుడి కుమార్తె మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చింది" అంటూ సరస్వతి శైలజను గురించి ఇంత వరకూ తెలుసుకున్న సమాచారమంతా భర్తకు నివేదించింది.

దయానిధికి చాలా సంతోషం అయింది. "కమలాకరాన్ని చూచి గూడా చాలాయేళ్ళు అయిందమ్మా– నేను" అంటూ మొదలుపెట్టి దయానిధి స్నేహితుడి కుటుంబాన్ని గురించి క్షేమ సమాచారాలన్నీ అడిగి తెలుసుకున్నాడు.

వాళ్ళతోపాటు మరో కప్పు టీ తీసుకుంది శైలజ.

ఆమె యిక్కడకు వచ్చి దిగబడ్డ సందర్భం తెలుసుకుని దయానిధీ, సరస్వతీ చాలా ఆశ్చర్యపోయారు.

– ఎం.బి.ఎ. చదువుతున్న పది మంది కుర్రవాళ్ళ గుంపుతోపాటు వచ్చింది శైలజ యిక్కడకు విహార యాత్ర–అదీ కరికులమ్‌లో తప్పనిసరి భాగం కనుక.

కుర్రవాళ్ళలో ఒకడు బస్ ఎక్కడంలో ఎక్కువ తక్కువ అయి రోడ్‌మీద పడిపోయాడు. మరో సైకిల్ అతని కాలిమీదుగా నడిచింది. కుర్రవాళ్ళందరూ అతడిని దగ్గర్లో వున్న నర్సింగ్ హోంకు తీసుకు వెళ్ళారు.

'మల్టిపుల్ ఫ్రాక్చర్' అన్నాడు డాక్టర్.

"వారం రోజులు ఆ అబ్బాయిని ఇక్కడ నుంచి కదల్చకూడదు; వీరితోపాటు మీ గ్రూప్‌లో ఎవరైనా ఒకరు వుండండి. వారి తల్లిదండ్రులు ఎవరేనా వచ్చేంతవరకయినా ఒకరు వుండడం, ఆరోగ్య దృష్ట్యా మాత్రమే కాకుండా వారి మనస్సు విరిగిపోకుండా వుండటానికి తప్పనిసరిగా అవసరం" అన్నారు డాక్టర్.

తతిమా కుర్రవాళ్ళందరూ ముఖ ముఖాలు చూచుకున్నారు. విహార యాత్రలు, వినోద యాత్రలు అంటే అందరికీ ఇష్టమే గానీ అందులో ఇలాంటి దుర్ఘటన ఎదురైతే ధైర్యంగా తట్టుకునే ధీమా ఎవరికీ లేదు. ఎవరికివారు నాకు ఈ పని వుంది, ఆ పని వుంది. తక్షణం ఊరికి వెళ్ళవలసిన అవసరం వుంది–లేకపోతే ప్రపంచం తల్లక్రిందులయిపోతుంది–అన్నట్లుగా మాట్లాడుతున్నారు. వాళ్ళ మనస్థితిని చూచి తనకు చాలా చికాకు, అసహ్యం అనిపించింది. సరే–మీరందరూ వెళ్ళండి. నేను శేఖర్‌కు తోడుగా వుంటాను–పది రోజులయినా సరే. నాకు పాఠాలు పోయినా మేకప్ చేసుకోగలను–అని ధీమాగా చెప్పింది.

ఆస్పత్రిలో శేఖర్‌ను, శైలజను వదిలేసి అందరూ హాయిగా ఊపిరి పీల్చుకుంటూ వెళ్ళిపోయారు. శేఖర్ శైలజ వంక కృతజ్ఞతగా చూచాడు; కాలి నెప్పికి ఒక పక్క శరీరమంతా బాధగా వున్నా.

డాక్టర్లు అతనికి నిద్ర మాత్రలు యిచ్చి–మరో మూడు గంటల వరకు లేవడని చెప్పిన తరువాత శైలజ గుర్తుచేసుకుంది, ఈ కొండ మీది నగరంలో నాన్నగారి స్నేహితుడు ఒకాయన ఇటీవలనే చేరుకున్నాడనీ, ఆయన్ని చూచి కొంత మోరల్ సపోర్ట్ పొందవచ్చనీ!

"అయితే ఉదయం నుంచి ఆస్పత్రిలోనే ఉన్నావన్నమాట!" అన్నాడు దయానిధి.

"స్నానమన్నా చేశావా–పాపం" అంది సరస్వతి.

"లేదండీ. అందుకే చికాగ్గా వుంది మనసంతా" అన్నది వెంటనే శైలజ. సరస్వతి సలహామీద శైలజ అక్కడే వుండిపోవడానికీ, మరునాడు ఆస్పత్రికి వెళ్ళటానికీ అంగీకరించింది.

శైలజ స్నానంచేసి ఇవతలకు వచ్చాక, "శేఖర్‌కు త్వరగా నయమయిపోతుందిలే అమ్మా. నువ్వేం బెంగపెట్టుకోకు. మీ అంకుల్ యిందాక ఫోన్‌చేసి ఆస్పత్రికి చెప్పారు. నువ్వూ రేపు ఉదయమే వస్తావని...ఇంతకూ అతనంటే నీకు ఇష్టమేనా? మీ అమ్మగారూ, నాన్నగారూ ఒప్పుకున్నారా?" అనడిగింది.

"ఏమిటి అంటే మీరు అంటున్నది?" అంది శైలజ. సరస్వతి మాటలు ఆమెకు ఏమాత్రం అర్థం కాలేదని ఆమె ముఖం పెట్టిన తీరే చెబుతోంది.

"అదేనమ్మా! శేఖర్ గురించి చెబుతున్నాను. నీవేం బెంగపెట్టుకోకు."

"నాకెందుకండీ బెంగ?" అంది శైలజ ఇంకా అయోమయంగానే.

"నువ్వు శేఖర్‌ను చేసుకోవటానికి మీ అమ్మ, నాన్న అంగీకరించారామ్మా?" అనడిగింది ఈమారు సరస్వతి అచ్చ తెలుగులో.

"ఓ! మైగాడ్!!" అని అరిచింది ఒక్కమారు శైలజ. తరువాత "నేనేం అతన్ని ప్రేమించడం లేదండీ! అతన్ని పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదు. అందువల్ల అమ్మ, నాన్నల అంగీకారం కోసం వెదికే అవసరమే లేదు" అంది.

"మరయితే యింత రిస్క్ తీసుకుని యిక్కడ వారం రోజులు ఎలా వుండిపోదామనుకున్నావమ్మా?" అనడిగింది, సరస్వతి అమాయకంగా, అయోమయంగా.

"ఏం చేయమంటారు? ఎవరో ఒకరు వుండి తీరాలని డాక్టర్ పట్టుపట్టాడు. ఎవరూ వుండేందుకు అంగీకరించలేదు. అంతా స్వార్థపరులు. నేను వుంటానని చెప్పాను. అలా చెప్పినందుకు ఇప్పుడేదో విచారిస్తానని అనుకోకండి. నో రిగ్రెట్స్. మిమ్మల్ని కలుసుకోవడం నా అదృష్టం" అంది శైలజ.

"అతని మీద యేమీ ఇంటరెస్ట్ లేకుండా, నువ్వు ఇక్కడ వుండిపోవటానికి అంగీకరించడం నాకు కాస్త విచిత్రంగానే వుంది సుమా!" అంది సరస్వతి. ఇంకా అయోమయం నుంచి బయటపడకుండానే.

"శేఖర్ నాకు యేమీకాదు; నిజమే ఆంటీ! కానయితే అతడే నాకు అన్నో, తమ్ముడో, బాబాయో, మేనమామో, మేనత్త కొడుకో అయితే యిలాగే నేనూ అందరిలాగ అతన్ని వదలి వెళ్ళిపోగలన్నా? బంధుత్వం, వ్యక్తిగత ఆపేక్షలు కాకుండా-కేవలం మానవతా దృష్టిలంటూ కూడా ఒకటి వుంది గదా ఆంటీ. అదే నన్ను కదిలించివేస్తూ వుంటుంది, యిటువంటి సందర్భాలలో. అందుకనే వుండిపోయాను. అంతకంటె మరేం లేదు" అని సుదీర్ఘంగా జవాబు చెప్పింది శైలజ.

సరస్వతికి ఎంతో ఆనందం కలిగించాయి ఆ మాటలు.

శైలజ వారం రోజులపాటు వాళ్ళ యింట్లో వుంది. సరస్వతికి ఎన్నో విషయాలు కొత్త కొత్త కోణాల నుంచి చెప్పింది. 'ఇట్లాంటి అమ్మాయి నాకు కోడలయితే ఎంత బాగుండును!' అనుకుంది ఆమె.

"ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు? నీకు నచ్చిన కుర్రవాడు ఎక్కడా తటస్థ పడలేదా?" అనడిగింది.

"తటస్థ పడకనేం? పడ్డాడు. కాని కులాలు, మతాలు, ధనాధిక్యతలు అడ్డం వస్తున్నాయి. బహుశ నేను ఎప్పటికీ పెళ్ళి చేసుకోనేమో!" అంది శైలజ.

ఊరికి వెళ్ళిపోయే ముందు శేఖర్‌కూడా అన్నాడు సరస్వతితో. "శైలజ చాలా సాహసంగల పిల్ల. అందుకనే మా నాన్నగారు కూడా అనుమానంలో పడ్డారు. సాటి మనిషికి సాయపడడం చేసినందుకయినా, చూపవలసిన కృతజ్ఞతలేదు ఆయన మాటల్లో. పైగా యేదో తన ఆస్తినంతా దోచుకుపోతున్నట్లు చూస్తారు ఆ పిల్లవేపు."

శేఖర్ తండ్రి దయానిధితో 'ఆ అమ్మాయి అమాయకురాలు అని



## వృక్షాల మ్యూజియం!

మనం ఎన్నెన్నో మ్యూజియంలను గురించి విన్నాం. అయితే చెట్ల మ్యూజియంను గురించి వినలేదుగదూ? ఈ మ్యూజియం గుజరాత్‌లోని బరోడాలో ఉన్నది. ఇండో పెట్రో కెమికల్ కార్పొరేషన్ వారు దీన్ని నెలకొల్పారు. ఇందులో 1 లక్ష వృక్షాలు ఉన్నాయి! త్వరలో కనుమరుగు కానున్న అతి విలువైన 70 రకాల వృక్షాల కొరకు ఈ మ్యూజియంలోని 32 హెక్టార్ల భూమిని కేటాయించారు. ఈ అపురూపమైన వృక్షాల మ్యూజియం 75 హెక్టార్లలో ఉంది. — కొడిమెల

నేను అనుకోను. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మలేం, అన్నప్పుడు యీ మాటలు అనడంలో ఆయన ఉద్దేశ్యం యేమిటో దయానిధికి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

"నువ్వు వస్తున్నట్లు మీ నాన్నగారు ఒక ఉత్తరముక్కయినా వ్రాయవలసింది ముందుగా. ఇప్పుడు థాంక్స్ చెప్పడంలో యేం స్నేహధర్మం వుంది-" అన్నాడు దయానిధి శైలజతో వారం రోజుల తర్వాత ఆమె తండ్రి దగ్గర్నుంచీ ఉత్తరం వచ్చినప్పుడు.

"నేనే ముందు వ్రాయవద్దని చెప్పానండీ. ఎందుకంటే, మా ప్రోగ్రాం ప్రకారం-ఒక్క క్షణమైనా తీరిక, వెసులుబాటు లేదు. శేఖర్‌కు ఈ దెబ్బ తగలకపోతే నేను మిమ్మల్ని చూడకుండానే వెళ్ళిపోయేదాన్ని. ఒక్క అరగంటన్నా తీరిక చేసుకుని చూచిరామ్మా-సంతోషిస్తారు అని నాన్నగారు ఎంత చెప్పినా నాకు ఆ పని సాధ్యం అవుతుందని అనిపించలేదు. అందుకని ససేమిరా నేనే ఉత్తరం వ్రాయనివ్వలేదు. తీరా ఆయన ఉత్తరం వ్రాసి నేను మిమ్మల్ని చూడకుండా వెడితే మీరు యేమనుకుంటారు-నన్ను గురించీ, మా నాన్నగారిని గురించీ? ఆ ఎంబరాస్‌మెంట్ కల్పించకూడదని అనుకున్నాను. అంతే" అని సంజాయిషీ చెప్పింది శైలజ.

ఆ అమ్మాయివెళ్ళి పోయిన తర్వాత, "చాలా చురుకైన పిల్ల. చలాకీ అయినదే గాకుండా బహు జాగ్రత్త అయినది. మన అబ్బాయికి యిటువంటి అమ్మాయి దొరికితే ఎంత బాగుండును" అంది సరస్వతి దయానిధితో.

"ఇలాంటి అమ్మాయి ఎందుకు? నీకు అంతగా నచ్చితే ఈ అమ్మాయినే చేసుకోరాదూ?" అన్నాడు దయానిధి.

కానీ-

అమెరికాలో వున్నవాళ్ళ అబ్బాయి అక్కడి ఓ 'నేటివ్ గర్ల్'ను పెళ్ళి చేసుకుందుకూ, ఇండియాకు తీసుకు వచ్చేందుకూ నిశ్చయం చేసుకున్నాడనీ, ఈ నిశ్చయం ఆ మరుసటి రోజు 'ఉత్తరం' రూపంలో వస్తుందనీ ఆ ఇద్దరికీ తెలియదు.